వీర్నపల్లిలో సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

నేర నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకం

- ఎస్పీ అఖిల్ మహాజన్
- వీర్నపల్లి జీపీ ఆఫీస్‌లో సీసీ కెమెరాలు ప్రారంభం

వీర్నపల్లి, జనవరి 9: నేర నియంత్రణ, క్లిష్టమైన కేసుల ఛేదనలో సీసీ కెమెరాల పాత్ర కీలకమని ఎస్పీ అఖిల్ మహాజన్ పేర్కొన్నారు. మంగళవారం వీర్నపల్లి పంచాయతీ కార్యాలయంలో దాతల సాయంతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ట్రైనీ ఐపీఎస్ రాహుల్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. అనంతరం 'మీ కోసం'లో భాగంగా యూత్ సభ్యులకు క్రికెట్, వాలీబాల్ కిట్లను అందజేసి, మాట్లాడారు. వీర్నపల్లి మండలమంటే తనకు ప్రేమ ఎక్కువని, అందుకే నెలలో రెండుసార్లు ఈ ప్రాంతానికి వస్తానని చెప్పారు. యువత వ్యసనాలకు దూరంగా ఉంటూ ఉజ్వల భవితకు బాటలు వేసుకోవాలని సూచించారు. మత్తు పదార్థాలకు బానిసై విలువైన జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. సీసీ కెమెరాలు వితరణ చేసిన ట్రాక్టర్, టెంట్‌హౌస్ అసోసియేషన్ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. ఇక్కడ డీఎస్పీ ఉదయ్‌రెడ్డి, సీఐ శశిధర్‌రెడ్డి, ఎస్ఐ నవత, సర్పంచ్ పాటి దినకర్, ఎంపీటీసీ మల్లారపు అరుణ్‌కుమార్, ఉప సర్పంచ్ బోయిని రవి, బంజారా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుగులోత్ సురేశ్‌నాయక్ ఉన్నారు. కాగా, సీసీ కెమెరాల ప్రారంభోత్సవం సందర్భంగా పోలీసులు సర్పంచ్, ఉప సర్పంచ్ కుర్చీలను పక్కకు పడేయడంపై సర్పంచ్ పాటి దినకర్ అసహనం వ్యక్తం చేశారు.

స్కాలర్‌షిప్‌ల హార్డ్‌కాపీలు సమర్పించాలి

వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షిస్తున్న అదనపు కలెక్టర్ పీ గౌతమి

- అదనపు కలెక్టర్ పూజారి గౌతమి

కలెక్టరేట్, జనవరి 9: జిల్లాలో 2022-23 విద్యాసంవత్సరానికి సంబంధించిన ప్రీ, పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌ల హార్డ్ కాపీలను సమర్పించాలని, 2024కు సంబంధించి రిజిస్ట్రేషన్లలో వేగం పెంచాలని అదనపు కలెక్టర్ పూజారి గౌతమి ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి ప్రభుత్వ పాఠశాలల హెచ్ఎంలు, కాలేజీల ప్రిన్సిపాళ్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్కాలర్‌షిప్‌లకు సంబంధించి 228 పెండింగ్ హార్డ్ కాపీలను ఈ నెలాఖరులోగా అందజేయాలన్నారు. 2023-24లో ఇప్పటి వరకు 1,673 రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయని, ఈనెలాఖరులోగా మిగిలినవి పూర్తి చేయాలని నిర్దేశించారు. ఈ విషయంలో హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లను సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్లాలన్నారు. వీసీలో ఎస్సీ వెల్ఫేర్ అధికారి డా వినోద్‌కుమార్, విజయలక్ష్మి, పర్యవేక్షకుడు అజామ్, తదితరులు ఉన్నారు.

సీఎంఆర్ లక్ష్యం పూర్తి చేయాలి

తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షిస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

- తహసీల్దార్లు ప్రత్యేక దృష్టిసారించాలి
- వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ అనురాగ్ జయంతి

కలెక్టరేట్, జనవరి 9: జిల్లాలోని రైస్‌మిల్లరు ఎఫ్‌సీఐకి ఇవ్వాల్సిన సీఎంఆర్(కస్టమ్స్ మిల్లింగ్ రైస్) లక్ష్యాన్ని పూర్తి చేసేలా తహసీల్దార్లు చర్యలు చేపట్టాలని కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. మంగళవారం ఐడీవోసీ నుంచి తహసీల్దార్లతో వీడియా కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రణాళికాబద్ధంగా రోజువారి లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. అలాగే భూ సమస్యలు పరిష్కరించాలని, ఓటు నమోదు అర్జీల పరిష్కారంపై దృష్టిపెట్టాలని నిర్దేశించారు. హైకోర్టు, ఇతర కోర్టుల పరిధిలోని పెండింగ్ కేసులను పరిష్కరించాలని చెప్పారు. భూ సమస్యల పరిష్కారంలో ఎల్లారెడ్డిపేట తహసీల్ ఆఫీసు పనితీరు బాగున్నదని అభినందించారు. కోనరావుపేటలో పెండింగ్ సమస్యలు ఎక్కువగా ఉన్నాయని, తహసీల్దార్ పనితీరు బాగాలేదని మందలించారు. తంగళ్లపల్లి, కోనరావుపేట, బోయినపల్లి మండలాల్లో ఆదాయ సర్టిఫికెట్ల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. రేపటిలోగా క్లియర్ చేయాలన్నారు. వారంలోగా మీ-సేవ సర్వీసెస్‌లో ఉన్న పెండింగ్ దరఖాస్తులను మిషన్ మోడ్‌లో పరిష్కరించాలన్నారు. తంగళ్లపల్లి సర్వేయర్ పనితీరు బాగోలేదని అతడిపై చార్జెస్ ఫ్రేమ్ చేయాలని అదనపు కలెక్టర్‌కు సూచించారు. రెండు, మూడు నెలల్లో పార్లమెంట్ ఎన్నికలు జరగనున్నందున ఫారం-6, 7, 8 దరఖాస్తుల పరిష్కారంపై దృష్టి పెట్టాలని సూచించారు. ఓటరు జాబితాలో డబుల్, డూప్లికేట్, డెత్ ఓటర్లు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని. అర్హులైన యువతను ఓటర్లుగా నమోదు చేయాలన్నారు. ప్రజాపాలన అర్జీలను వేగంగా ఆన్‌లైన్ చేయాలని సూచించారు. వీసీలో అదనపు కలెక్టర్లు ఎన్ ఖీమ్యానాయక్, పూజారి గౌతమి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బీ గంగయ్య, పౌరసరఫరాల అధికారి జితేందర్‌రెడ్డి, మేనేజర్ జితేంద్రప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఆకతాయిల ఆగడాలు అరికట్టండి

సీఐ ఉపేందర్‌కు వినతిపత్రం అందిస్తున్న రవిగౌడ్, నేతలు

సిరిసిల్ల టౌన్, జనవరి 9: విద్యాసంస్థలు, పాత బస్టాండ్ తదితర ప్రాంతాల్లో బైక్‌లపై వేగంగా దూసుకెళ్తూ విద్యార్థినులు, మహిళలను ఇబ్బందిపెడుతున్న ఆకతాయిల ఆగడాలను అరికట్టాలని బీఆర్ఎస్వీ నేత కంచర్ల రవిగౌడ్ మంగళవారం టౌన్ సీఐ ఉపేందర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, కొందరు యువకుల విపరీత ప్రవర్తనతో విద్యార్థినులు మనోవేదనకు గురవుతున్నారని పేర్కొన్నారు. తన వినతిపై సీఐ సానుకూలంగా స్పందించారన్నారు. ఇక్కడ బీఆర్ఎస్వీ నాయకులు మట్టె శ్రీనివాస్, నవీన్, తిరుపతి, జగన్, సందీప్, నరేశ్, భాను, కిరణ్ తదితరులు ఉన్నారు.

వృద్ధురాలిపై లైంగిక దాడికి యత్నం

చందుర్తి, జనవరి 9: వృద్ధురాలిపై ఓ ఆటో డ్రైవర్ లైంగికదాడికి యత్నించాడు. చందుర్తి మండలంలో మంగళవారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చందుర్తి మండలంలోని కట్ట లింగంపేట గ్రామానికి చెందిన 40 ఏండ్ల ఆటో డ్రైవర్ ఆవునూరి తిరుపతికి చెందిన ఆటోలో లింగంపేటలో 70 ఏండ్ల వృద్ధురాలు ఎక్కింది. అయితే, ఆటోలో ఆమె ఒక్కలే ఉండడంతో తిరుపతి ఆమెను లింగంపేట శివారులోని అటవీ ప్రాంతానికి తీసుకెళ్లి లైంగిక దాడికి యత్నించాడు. దీంతో ఆమె కేకలు వేసి తప్పించుకున్నది. తర్వాత సదరు వృద్ధురాలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్ఐ అశోక్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పోస్టల్ సేవలను వినియోగించుకోవాలి

సిరిసిల్ల టౌన్, జనవరి 9: పోస్టాఫీసుల్లో వడ్డీ పెంపుతో పాటు ఆకర్షణీయమైన పొదుపు పథకాలు ప్రవేశపెట్టినందున ప్రజలు పోస్టల్ సేవలను వినియోగించుకోవాలని జిల్లా పోస్టల్ అధికారి దయానంద్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. జిల్లా పరిధిలోని పది డిపార్ట్‌మెంటల్, 87బ్రాంచ్ పోస్టాఫీసుల్లో స్పీడ్ పోస్ట్ బుకింగ్, ఎలక్ట్రానిక్ మనీఆర్డర్, పోస్టల్ రెవెన్యూ స్టాంప్ సేల్స్, ఇన్సూరెన్స్, చిన్న మొత్తాల పొదుపు పథకాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. జిల్లా కేంద్రంలోని సబ్ పోస్టాఫీస్‌లో ఆధార్ కేంద్రం ఏర్పాటు చేశామన్నారు.

అగ్రగామిగా నిలుపుకొందాం

గంభీరావుపేట, జనవరి 9: విద్యార్థులు కష్టపడి చదివి ప్రభుత్వ జూనియర్ కాలేజీని అగ్రగామిగా నిలుపుకొందామని కళాశాల ప్రిన్సిపాల్ వెంకట్‌నాయక్ పిలుపునిచ్చారు. మంగళవారం కాలేజీలో నిర్వహించిన పేరెంట్స్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. వార్షిక పరీక్షలు సమీపిస్తున్నందున ఈ నెల 2 నుంచి కళాశాలలో ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. తల్లిదండ్రులు సైతం పిల్లల చదువుపై శ్రద్ధ చూపాలని కోరారు.

నెత్తిన బోనాలతో క్యూలైన్లలో భక్తులు

బద్ది పోచమ్మకు ఘనంగా బోనాలు

వేములవాడ రాజన్నను దర్శించుకున్న అనంతరం అనుబంధ దేవాలయమైన బద్ది పోచమ్మ అమ్మవారికి బోనం సమర్పించడం ఆనవాయితీ. మంగళవారం భక్తులు డప్పుచప్పుళ్ల మధ్య నృత్యం చేస్తూ పురవీధుల గుండా ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి కల్లు పోసి.. సారె పెట్టి.. బోనం సమర్పించారు. పాడిపంట.. పిల్లాపాపలతో సల్లంగ సూడు తల్లీ.. అంటూ అమ్మవారిని వేడుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా పర్యవేక్షకుడు హరిహరనాథ్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

– వేములవాడ టౌన్, జనవరి 9

పార్టీ శ్రేణులతో కేటీఆర్ మమేకం

కేటీఆర్‌కు తిరుపతి లడ్డు అందిస్తున్న అభిమాని, పీఏసీఎస్ డైరెక్టర్ దేవేందర్‌యాదవ్

సిరిసిల్ల రూరల్, జనవరి 9: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ పార్టీ శ్రేణులు, అభిమానులతో మమేకమవుతున్నారు. పార్లమెంట్ ఎన్నికల సమీక్షా సమావేశాల్లో బీజీగా ఉంటూనే తనను కలిసేందుకు వచ్చిన వారిని ఆత్మీయంగా పలుకరిస్తున్నారు. సోమవారం తెలంగాణ భవన్‌లో బద్దెనపల్లికి చెందిన కార్యకర్త కూతురు హర్షితను ఆశీర్వదించి చిరు కానుక అందించారు. మంగళవారం గండిలచ్చపేటకు చెందిన సింగిల్ విండో డైరెక్టర్, కేటీఆర్ అభిమాని బండి దేవేందర్‌యాదవ్ ఎమ్మెల్యే గా కేటీఆర్ గెలిచిన నేపథ్యంలో ఇటీవలే తిరుపతిలో స్వామివారిని దర్శించుకోగా, రామన్నకు లడ్డూ ప్రసాదం అందించారు. రామన్నపల్లెకు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నేత ఆత్మకూరి చంటి యాదవ్ కేటీఆర్‌ను కలువగా స్వీటు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. వీరివెంట మాజీ ఎఎంసీ డైరెక్టర్ మోతే మహేశ్, తదితరులు ఉన్నారు.

తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో కందేపి రాణీప్రసాద్

తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌తో డాక్టర్ కందేపి రాణీప్రసాద్

సిరిసిల్ల టౌన్, జనవరి 9: జిల్లా కేంద్రానికి చెందిన ప్రముఖ బాలసాహితీవేత్త డాక్టర్ కందేపి రాణీప్రసాద్ సాహితీరంగంలో మరో ఘనత సాధించింది. చెట్ల తీగలు, పూలు, కొమ్మలు, ఆకులు, మొగ్గలు, కాండం, బెరడుతో 700ల రకాలకు పైగా చిత్రాలను రూపొందించి 'మృగయాపురి' పుస్తకంగా తీసుకురావడంతో పాటు కరోనా సమయం లో వ్యాసాలు రాసి ప్రజలను చైతన్యవంతులను చేసినందుకు గానూ తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్సులో ఆమెకు చోటు దక్కింది. గతంలోనూ ఆమె రచనలకు అనేక పురస్కారాలొచ్చాయి. కాగా. తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకున్న ఆమెను సాహితీవేత్తలు, కవులు అభినందించారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

బిల్డింగ్ అమ్మబడును

★కరీంనగర్‌లోని కొత్త యాస్వాడ హరిహర రోడ్ నెంబర్.2 గ్రౌండ్ ఫ్లోర్ ఓపెన్ ఫస్ట్ ఫ్లోర్ 2BHK ఉత్తరం ఫేసింగ్. 30 ఫీట్ రోడ్డు. గల బిల్డింగ్ అమ్మబడును. సంప్ర|| సెల్: 9848034203.

NTK-317328

CHANGE OF NAME

★I, POTU PRASAD S/o. LINGAM R/o. 1-2-190, Krishna nagar, Jagtial, T.S have Changed my name as POTHU PRASAD, S/o. LINGAM

NT-319323

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే

3+1 స్కీం కలదు

ప్రకటనల విభాగం...

GST 5% వర్తించును

Cell: 91827 77571

91827 77194

సమన్వయంతో పని చేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్

బోయినపల్లి, జనవరి 9: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేసి, గ్రామాలను ప్రగతి పథంలో తీసుకెళ్లాలని ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్ సూచించారు. మంగళవారం ఎంపీపీ అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించగా, పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. మిషన్ భగీరథ నీటి సరఫరాలో లీకేజీలు ఎక్కువగా ఉన్నాయని, వాటిని నియంత్రించాలన్నారు. బోయినపల్లి ప్రాథమిక పాఠశాలకు ఉపాధ్యాయుడిని నియమించాలని ఎంపీటీసీ బుచ్చమ్మ కోరారు. గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు బిల్లులు ఇప్పించాలని కోరారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ, ప్రజా పాలనలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని కోరారు. సమావేశంలో ఎంపీటీసీలు సంబ బుచ్చమ్మ, ఉయ్యాల శ్రీనివాస్, బాలగోని గౌతమి, కొంకటి శిరీష, తహసీల్దార్ పుష్పలత, ఎంపీడీవో రాజేందర్‌రెడ్డి, ఎంపీవో గంగాతిలక్, డీఈఈ సత్యనారాయణ, ఏవో ప్రణీత, ఏఎంసీ చైర్మన్ సత్యనారాయణరెడ్డి, ఏపీవో సబిత, సర్పంచులు గుంటి లతాశ్రీ, ఇల్లందుల శంకర్, ఒంటెల గోపాల్‌రెడ్డి, బూర్గుల నందయ్య, తదితరులు పాల్గొన్నారు.

సెస్ చైర్మన్ చిక్కాల రామారావును సన్మానిస్తున్న ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు

మినీ యాదాద్రిలో చిక్కాల

సిరిసిల్ల రూరల్, జనవరి9: మినీ యాదాద్రిగా పేరుగాంచిన తంగళ్లపల్లిలోని శ్రీలక్ష్మీ నర్సింహస్వామి ఆలయాన్ని మంగళవారం సెస్ చైర్మన్ చిక్కాల రామారావు సందర్శించి, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు జ్ఞాపికను అందించి సత్కరించారు. ఇక్కడ సర్పంచ్ అంకారపు అనిత, ఎంపీటీసీ కోడి అంతయ్య, ఉప సర్పంచ్ పెద్దూరి తిరుపతి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గజభీంకార్ రాజన్న, పడిగెల రాజు, ఫ్యాక్స్ వైస్ చైర్మన్ ఎగుమామిడి వెంకటరమణారెడ్డి, మోర లక్ష్మీరాజం, మచ్చ ఆంజనేయులు, రాపెల్లి ఆనందం, సామల రమేశ్, సుద్దాల శ్రీనివాస్‌గౌడ్, సత్యనారాయణరెడ్డి, రామాగౌడ్, దుర్గయ్య, ప్రసాద్, బాలకృష్ణ ఉన్నారు. తర్వాత ఆయన కస్బెక టూర్‌లో బీఆర్ఎస్ గ్రామాధ్యక్షుడు బెల్లే దేవయ్యను పరామర్శించారు.

'ఉపాధి' గ్రామ సభలు

ఇల్లంతకుంట, జనవరి 9: మండలకేంద్రం అన్ని గ్రామాల్లో మంగళవారం ఉపాధి హామీ పథకం నిర్వహణపై గ్రామ సభలు నిర్వహించామని ఎంపీడీవో మీర్జా పేర్కొన్నారు. సోషల్ అడిట్ అధికారులు రికార్డులను పరిశీలించి చేపట్టిన పనుల వివరాలను తనిఖీ చేశారు. ఈ నెల 12న మండల పరిషత్‌లో సోషల్ అడిట్ నిర్వహిస్తామన్నారు.

కొడుకులను తీసుకెళ్లొద్దని..

- వేములవాడలో ముస్కాన్ అధికారుల వాహనాన్ని అడ్డుకున్న తల్లి

తిప్పాపూర్‌లో చిన్నారుల తల్లితో మాట్లాడుతున్న అధికారులు

వేములవాడ, జనవరి 9: ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమంలో భాగంగా వేములవాడ మున్సిపల్ పరిధిలోని తిప్పాపూర్‌లో ముగ్గురు చిన్నారులను అధికారులు గుర్తించారు. ఈ క్రమంలో మంగళవారం వారిని వాహనంలో పాఠశాలకు తీసుకెళ్తుండగా, ఆ చిన్నారుల తల్లి అధికారులను అడ్డుకున్నది. తాము ఇక్కడికి వలస వచ్చామని.. స్థానిక బడిలో చేర్పిస్తానంటూ అధికారులకు చెప్పింది. అయితే వారు వినకపోవడంతో ఆ తల్లి దాదాపు గంటపాటు అధికారుల వాహనాన్ని అడ్డుకున్నది. చివరకు స్థానిక పోలీసుల సాయంతో అధికారులు ఇద్దరు చిన్నారులను సిరిసిల్లలోని గురుకుల పాఠశాలకు తరలించగా, ఒక చిన్నారి మాత్రం అక్కడి నుంచి పరారయ్యాడు.

మామిడిపల్లిలో ఇటీవల ప్రారంభించిన పల్లె దవాఖానకు వేసిన తాళం, గ్రామంలోని ఓ అద్దె భవనంలో విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది

ఆర్భాటంగా ప్రారంభం.. తెల్లారే తాళం

- అసంపూర్తిగా పల్లె దవాఖానల భవనాలు
- అందుబాటులోకి తేవాలంటున్న గ్రామస్తులు

కోనరావుపేట, మామిడిపల్లిలో పల్లె దవాఖానల భవనాలను అధికారులు ఆరు నెలల కిందటే ఆర్భాటంగా ప్రారంభించారు. అయితే ఎల్ఆర్ఎస్, ప్లంబింగ్ పనులు పూర్తికాలేదు. ఫర్నీచర్ ఏర్పాటు చేయలేదు. దీంతో తెల్లారే ఈ భవనాలకు తాళం వేశారు. నాటి నుంచి అద్దె గదుల్లోనే వైద్య సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. కాగా, అధికారుల తీరుపై ఆయా గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే పనులు పూర్తి చేసి భవనాలను అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

– కోనరావుపేట, జనవరి 9

బాధిత కుటుంబాలకు పరామర్శ

సిరిసిల్ల టౌన్, జనవరి 9: మున్సిపల్ కౌన్సిలర్ రాపెల్లి దినేశ్ తల్లి రాపెల్లి రాధమ్మ ఇటీవల మరణించగా బీఆర్ఎస్ రాష్ట్ర నేత చీటి నర్సింగరావు, పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి శాంతినగర్‌లోని వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు. మాజీ కౌన్సిలర్ దార అశోక్ తండ్రి దార పెంటయ్య, బీఆర్ఎస్ 2వ వార్డు కమిటీ అధ్యక్షుడు పత్తిపాక రఘు నందన్ తండ్రి విఠల్ ఇటీవల మరణించగా వారి కుటుంబాలను ఓదార్చారు. అనంతరం బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, విశ్వనాథ స్వామి ఆలయ కమిటీ మాజీ చైర్మన్ రాజూరి వాసుదేవరాయలు తల్లి రాజూరి వజ్రమణి మరణించగా మృతదేహం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇక్కడ కౌన్సిలర్ రాజు, మురళి, మధు పాల్గొన్నారు.

సిరిసిల్ల రూరల్, జనవరి 9: రామన్నపల్లెలో రాగుల నర్సయ్య కుటుంబాన్ని మాజీ జడ్పీటీసీ, బీఆర్ఎస్ నేత కోడి అంతయ్య పరామర్శించారు. సర్పంచ్ ఆత్మకూరి రంగయ్యయాదవ్, జక్కుల శ్రీశైలం, గుండి అనిల్, పయ్యావుల ప్రవీణ్, రాగుల కనకయ్య, దేవయ్య ఉన్నారు.

నియామకం

వేములవాడ, జనవరి 9: పీఆర్‌టీయూ తెలంగాణ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడిగా మ్యాడారం హరికృష్ణ, ప్రధాన కార్యదర్శిగా టీ శ్రీకాంత్‌ను నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు ఉమాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి పర్వతీసత్యనారాయణ వారికి నియామకపత్రాన్ని అందజేశారు.

కేజీబీవీని సందర్శించిన కలెక్టర్

సిరిసిల్ల రూరల్, జనవరి 9: తంగళ్లపల్లి మండలం పద్మనగర్ శివారులోని కస్తూర్బాగాంధీ విద్యాలయాన్ని కలెక్టర్ అనురాగ్ జయంతి మంగళవారం సందర్శించారు. పాఠశాలలో టాటా ఇనిస్టి ట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ ముంబై ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న షేరో ప్రాజెక్టు అక్టివిటీలో భాగంగా జీవన నైపుణ్యాలు, స్టెమ్ స్కిల్స్ చేపట్టారు. కార్యక్రమ నిర్వహణ, విధానాన్ని తెలుసుకున్నారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ పూజారి గౌతమి, సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీరాజం, డీఈవో రమేశ్ కుమార్, తదితరులు ఉన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థిని ఎంపిక

సిరిసిల్ల రూరల్, జనవరి 9: తంగళ్లపల్లిలోని తెలంగాణ గిరిజన సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థిని భార్గవి జాతీయ స్థాయి హస్త కళ పోటీలకు ఎంపికైంది. రాజన్న సిరిసిల్ల జిల్లాలో నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో ఈ నెల 5న నిర్వహించిన రాష్ట్ర స్థాయి యువజనోత్సవాల్లో హస్తకళా నైపుణ్యం విభాగంలో భార్గవి ఉత్తమ ప్రతిభ కనబరించింది. దీంతో మహారాష్ట్రలోని నాసిక్‌లో జరిగే జాతీయ పోటీలకు ఎంపికైంది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రజినీ, ఉపాధ్యాయులు భార్గవిని అభినందించారు.

నాటేస్తుండగా కరెంట్ షాక్

- పొలంలోనే ప్రాణాలు వదిలిన మహిళ
- తాడూరులో విషాదం

మధుప్రియ(ఫైల్)

సిరిసిల్ల రూరల్, జనవరి 9: పొలంలో నాటేస్తున్న మహిళను మత్యువు రూపంలో కరెంట్ బలి తీసుకున్నది. బురదలో కరెంట్ తీగలు తగిలి ప్రాణాలు విడిచింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తంగళ్లపల్లి మండలం తాడూరు గ్రామానికి చెందిన మధుప్రియ (28) మంగళవారం తమ పొలంలో నాటేసేందుకు కూలీలతో వెళ్లింది. నాటేస్తుండగా పొలంలో ఉన్న స్తంభానికి గల సపోర్టు వైరు తగలడంతో షాక్‌కు గురై బురదలోనే కుప్పకూలింది. చుట్టుపక్కల వారు గమనించి అంబులెన్స్‌లో సిరిసిల్ల దవాఖానకు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మరణించినట్లు నిర్ధారించారు. విగతజీవిగా మారిన మధుప్రియను చూసి భర్త రాకేశ్, పిల్లలు రుషి, రిషిక కన్నీరుమున్నీరయ్యారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు. మధుప్రియ భర్త ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

పెండింగ్ పనులు పూర్తి చేయాలి

కోనరావుపేట, జనవరి 9: మండల రెవెన్యూ కార్యాలయంలో పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ సూచించారు. మంగళవారం ఆయన తహసీల్ కార్యాలయాన్ని తనిఖీ చేసి ధరణి, ప్రజాపాలన, సర్టిఫికెట్లను పరిశీలించారు. ప్రజలకు ఇబ్బంది కలుగకుండా చూడాలన్నారు. అంతకుముందు మర్రపేట,నిజామాబాద్, కొలనూర్ గ్రామాల్లోని రైస్ మిల్లులను తనిఖీ చేశారు. ఇక్కడ డీఎస్వో జితేందర్‌రెడ్డి, తహసీల్దార్ విజయ్‌ప్రకాశ్‌రావు, ఆర్ఐ రజినీ ఉన్నారు.

సాధారణ ప్రసవాలే సురక్షితం

ఎల్లారెడ్డిపేట, జనవరి 9: సాధారణ ప్రసవాలే సురక్షితమని డీసీహెచ్ఎస్ మురళీధర్ రావు పేర్కొన్నారు. ఎల్లారెడ్డిపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో గర్భిణుల చికిత్స కోసం ఏర్పాటు చేసిన హెల్త్‌క్యాంపును మంగళవారం ప్రారంభించారు. రక్తహీనత, థైరాయిడ్, బీపీ, షుగర్, ఇన్‌ఫెక్షన్లు, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి గర్భిణులకు వివరించారు. ఇక్కడ డీఎంహెచ్‌వో సుమన్‌మోహన్ రావు, సీహెచ్‌సీ సూపరింటెండెంట్ ఎగదండి బాబు, గైనకాలజిస్టు కిరణ్మయి, మిడ్ వైఫరీ నర్సింగ్ ఆఫీసర్ శిరీష ఉన్నారు.